




రిలేదీక్షల్లో పాల్గొన్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు

కమ్ముకుంటున్న కరువు..!



మూడు సంవత్సరాలుగా కరువు ఛాయలు లేవని అనుకుంటుండగానే కరువు మరోమారు ఉమ్మడి అనంతపురం జిల్లాను పలకరిస్తోంది. సీజన్ ముగుస్తున్నా వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. ఈ ప్రభావం సాగుపై పడింది. జిల్లాలో సాధారణ సాగులోనే ఎనిమిది లక్షల ఎకరాల్లో ఇప్పటికీ విత్తనం పడలేదు. అందులో సత్యసాయి జిల్లాలో అయితే ఏకంగా 30 శాతమే సాగైంది. అనంతపురం జిల్లాలో 65 శాతం వరకు విత్తనం పడింది. సాగు విస్తీరణం గణనీయంగా తగ్గడం, వేసిన కొద్దిపాటి పంటలు కూడా ఎండదశలో ఉండడంతో ఈ సారి కరువు తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- 8.14 లక్షల ఎకరాలు బీడు
- ఉమ్మడి జిల్లాలో 47 మండలాల్లో వర్షాభావం
- ప్రత్యామ్నాయానికి వందశాతం సబ్సిడీ ఎత్తివేత
- 20 శాతం సబ్సిడీతో పంపిణీకి సిద్ధం



వర్షం లేక బీడుగా ఉన్న వ్యవసాయ పొలం



అరకొర వర్షంతో ఎండుతున్న వేరుశనగ పంట

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాధారణ సాగు 16.16 లక్షలు. అయితే సాగైంది చూస్తే 8.01 లక్షల ఎకరాలు మాత్రమే. విభజిత జిల్లా వారీగా చూస్తే సత్యసాయి జిల్లాలో ఏడు లక్షలు సాధారణ సాగైతే 2.07 లక్షల ఎకరాల్లో సాగైంది. ఐదు లక్షల ఎకరాల్లో పంటలు సాగవలేదు. ఇక అనంతపురం జిల్లాలో చూస్తే సాధారణ సాగు 9.15 లక్షల ఎకరాలయితే దాదాపు ఐదు లక్షల్లో పంటలు సాగయ్యాయి. ప్రధాన పంట వేరుశనగ 15.29 లక్షల ఎకరాలు సాధారణ సాగు అవ్వాల్సి ఉంది. 4.51 లక్షల ఎకరాల్లో సాగైంది. సత్యసాయి జిల్లాలో 1.55 లక్షల ఎకరాల్లోనే సాగైంది. ఆగస్టు మొదటి వారం వరకు మాత్రమే వేరుశనగ సాగుకు అనువైన సమయం. ఆ సమయం వరకు కూడా వర్షాలు పడకపోవడంతో వేరుశనగపై ఆశలు ఆవిరయ్యాయి.

47 మండలాల్లో వర్షాభావం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 63 మండలాలుంటే 47 మండలాల్లో వర్షాభావం నెలకొంది. ఇందులో ప్రధానంగా ఆరు మండలాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. అనంతపురం జిల్లాలో సాధారణ వర్షపాతం 168 మిల్లీమీటర్లుకుగాను 127 మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం పడింది. 24.3 శాతం తక్కువ వర్షపాతం పడింది. ఈ జిల్లాలో 21 మండలాల్లో వర్షాభావం నెలకొంది. ఇక సత్యసాయి జిల్లాలో సాధారణ వర్షపాతం 189.2 మిల్లీమీటర్లకుగాను 119.9 మిల్లీమీటర్లు పడింది. ఇందులో ఆరు మండలాల్లో 50 శాతం కంటే తక్కువ వర్షపాతం నమోదయింది.

20 శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు

ప్రధాన పంటల సాగుకు సమయం పూర్తవడంతో ప్రత్యామ్నాయ విత్తనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు సబ్సిడీని ఖరారు చేసింది. వరి విత్తనం కిలో రూ.37.80 పూర్తి స్థాయి ధర అయితే 80 శాతం సబ్సిడీ ప్రకారం రూ.30.24పోనూ రూ.7.56 నాన్ సబ్సిడీ మొత్తాన్ని ఇవ్వాలి. మినుములు, పెసలు కిలో రూ.117.50 పూర్తి స్థాయి ధర ప్రకారం సబ్సిడీ రూ.94 పోనూ నాన్ సబ్సిడీ రూ.23.50 రైతు చెల్లించాలి. కొర్ర కిలో పూర్తి ధర రూ.67.50కిగాను సబ్సిడీ ధర రూ.54పోనూ రూ.13.50 నాన్ సబ్సిడీ ధర చెల్లించాలి.

శ్రీసత్యసాయి కార్మికులపై ప్రభుత్వం నిర్లక్ష్యం

- తాగునీరు అందించే ప్రాజెక్టులపై చిన్నచూపు తగదు
- రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలి
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

చేసిన పనులకు వేతనాలు ఇవ్వాలంటూ 18 రోజులుగా శ్రీసత్యసాయి, శ్రీరామ్‌రెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికులు రిలేదీక్షలు చేస్తుంటే వారి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్య ధోరణి అవలంభించడం సరికాదని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు తెలిపారు. శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలేదీక్షలు శుక్రవారం 18వ రోజుకు చేరుకున్నాయి. వీరి దీక్షలకు నరసింగరావు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల ప్రజలకు తాగునీరు అందించే కార్మికులకు వేతనాలు సకాలంలో చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అలాంటిది నెల తరబడి కార్మికులకు వేతనాలు బకాయి పడుతుంటే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఒక నెల అలవెన్స్‌లు రాకపోతే ప్రజాప్రతినిధులు ఊరికే ఉంటారా అని ప్రశ్నించారు. సామాన్య మధ్యతరగతి, నిరుపేద కార్మికులు వేతనాలపై ఆధారపడి జీవిస్తున్నారని, అలాంటి వారికి వేతనాలు సకాలంలో ఇవ్వాలన్నారు. శాశ్వత స్వభావం కలిగిన పనులు చేస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేలా సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు అందరికీ వినతి పత్రాలు సమర్పించామన్నారు. స్వయాన కలెక్టర్ ఎమ్.గౌతమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయాలని యత్నించినప్పటికీ ఫైనాన్స్ విభాగంలో ఇందుకు సంబంధించిన బిల్లులు నిలిపివేశారన్నారు. ఈ పరిస్థితుల్లో కార్మికుల సమస్యలు ఎవరు పరిష్కరిస్తారో దిక్కుతోచని స్థితి నెలకొందన్నారు. అందుకోసమే ఈ నెల 25 నుంచి నిరవధిక సమ్మెలోకి కార్మికులు వెళుతున్నారని తెలిపారు. ఇప్పటికే జిల్లా అధికారులకు సమ్మె నోటీసులు అందజేశామన్నారు. ప్రజలకు ఇబ్బందులు రాకూడదని ఇన్ని రోజులు శాంతియుతంగా నిరసనలు చేపట్టామన్నారు. కార్మికుల జీవనభృతి సమస్యగా తలెత్తడంతో సమ్మెలో వెళుతున్నారని తెలిపారు. దీని వల్ల ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నా ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఆలోపు సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేస్తే బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి, శ్రీరామ్‌రెడ్డి తాగునీటి సరఫరా కార్మికుల యూనియన్ నాయకులు నాగరాజు, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

ఎంపీ తలారి రంగయ్య, అగ్రి అడ్వయిజరీ బోర్డ్ ఛైర్మన్ టి.రాజశేఖర్ రెడ్డి



జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించింలా వ్యవసాయ అధికారులు అన్ని రకాల చర్యలూ తీసుకోవాలని ఎంపీ తలారి రంగయ్య, అగ్రి అడ్వయిజరీ బోర్డ్ ఛైర్మన్ టి.రాజశేఖర్ రెడ్డి సూచించారు. శుక్రవారం నాడు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ ఎం.గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిసిసిబి బ్యాంక్ ఛైర్‌పర్సన్ లిఖిత, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అగ్రి అడ్వయిజరీ బోర్డ్ ఛైర్మన్ టి.రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ఆర్‌బికెల పరిధిలో చిరుధాన్యాలను రాయితీతో ఇవ్వాలన్నారు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా అర్ధరాత్రి కాకుండా పగటిపూట సక్రమంగా ఇవ్వాలన్నారు. చీనీ పంట విక్రయాల్లో రైతు నష్టపోకుండా కమిషన్ కాకుండా తీసుకునే సూట్ విక్రయాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ చిరుధాన్యాల సాగును మరింత పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకతి సేద్యం చేసుకునేందుకు ఎస్సీ, ఎస్టీ రైతులకు అవసరమైన విత్తనాలను సరఫరా చేస్తోందని, రైతులు దానిని సద్వినియోగం చేసుకునేలా వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు అనునిత్యం అప్రమత్తంగా ఉండి రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. సీజన్లో ఈ క్రాఫ్ బుకింగ్ పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధం శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో రోగులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అనేకసార్లు ఆందోళనలు చేసినా ఫలితం లేదన్నారు. ఆసుపత్రి ఏర్పడి 100 సంవత్సరాలైనా నేటికీ సౌకర్యాలు కల్పించకపోవడం బాధాకరమన్నారు. ప్రధానంగా బెడ్స్ సమస్యలు ఉన్నాయన్నారు. ఒకే బెడ్ మీద ఇద్దరు లేక ముగ్గురు ఉండే పరిస్థితి ఉందన్నారు. ఆసుపత్రి ఓ పాడుబడిన బంగ్లాలా తయారైందన్నారు. అదేవిధంగా మందుల కొరత వేధిస్తోందన్నారు. రోజుకు దాదాపు వెయ్యిమందికి పైగా అనారోగ్యంతో ఆసుపత్రికి వస్తుంటారని, వారికి తగ్గట్టుగా స్టాఫ్‌నర్సులు కూడా లేని పరిస్థితి ఉందన్నారు. 25 మంది నర్సులు ఉండాల్సిన చోట 8మంది పని చేస్తున్నారన్నారు. దీంతో నర్సులు పని ఒత్తిడితో మానసికంగా అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సదరన్ క్యాంప్ కోసం ఇతర ప్రాంతాల నుండి వచ్చి పరీక్షలు చేయించుకున్న వారికి ఇరవై ఒక్క రోజు లోపల సర్టిఫికెట్స్ మంజూరు చేయాలని ఐతే నెలలు తరబడి మంజూరు కావడం లేదన్నారు. కారణం అడిగితే టెక్నికల్ సమస్యగా ఉందని బుకాయిస్తున్నారన్నారు. నూతన భవనాన్ని వెంటనే ప్రారంభించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రిలో సిటీ స్కాన్,ఎంఆర్ఐ స్కాన్, మూత్రపిండాలకు సంబంధించి డయాసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మారుతీప్రసాద్, సాకే నాగరాజు, కసాపురం రమేష్, రంగమ్మ, పట్టణ కమిటీ సభ్యులు అబ్దుల్లా, ఓబులేసు, తిమ్మప్ప, సూరి, షబ్బీర్, జ్యోతి, జాకీర్, రామునాయక్, చరణ్, సునీల్, ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకీ, షాషా, ప్రతాప్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి ముందు ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు



లైటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిఐజి అమ్మిరెడ్డి

అవసరమైన చోట లైటింగ్ పెంచాలి : డిఐజి

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

అవసరమైన చోట లైటింగ్ పెంచి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక తపోవనం సర్కిల్ నుంచి నేషనల్ పార్కుకి వెళ్లే రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాఉతూ రోడ్డుకు ఇరువైపులా పొదలను తొలగించాలన్నారు. ముఖ్యంగా చీకటిగా ఉన్న చోట లైటింగ్ మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా రాంగ్ రూట్లో వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించడంతోపాటు ప్రమాదాల నియంత్రణకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వెంకటేష్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతి రాక ఆరుబయటే నిరీక్షణ..!

కమిషనర్‌ను కలిసేందుకు టిపిఎస్ మంజుల గంటల తరబడి పడిగాపులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నా పట్టుబట్టి టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా బదిలీపై వచ్చిన మంజులను విధుల్లో చేర్చుకోకుండా కమిషనర్ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే చర్చ కార్పొరేషన్ ఉద్యోగ వర్గాల్లో నడుస్తోంది. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భాగ్యలక్ష్మి టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ మంజులను విధుల్లో చేర్చుకోకుండా జాప్యం చేస్తూ వస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ టిపిఎస్ మంజులకు ఆఫీస్ ఆన్ డిప్యూటేషన్ కింద పెనుగొండ మున్సిపాల్టీలో నియమించారు. మంజుల పెనుగొండ మున్సిపాల్టీలో విధుల్లో చేరారు. కాగ ఆమె వేతనం, ఇంక్రిమెంట్ల నమోదు తదితర అంశాలన్నీ అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ నుంచే జరగాల్సి ఉంది. ఇందులో భాగంగా శుక్రవారం నాడు ఆమె సాయంత్రం ఐదు గంటల నుంచి కమిషనర్ భాగ్యలక్ష్మి కోసం వేచి ఉన్నారు. రాత్రి 7:30 గంటలు కావస్తున్నా ఆమెకు కమిషనర్ ఛాంబర్‌లోకి అనుమతి కల్పించలేదు. ఇదే సమయంలో బయటి వ్యక్తులు, కాంట్రాక్టర్లు, టౌన్ ప్లానింగ్ ఉద్యోగులు, ఇంజినీరింగ్ ఉన్నతాధికారి తదితరులు అందరూ కమిషనర్‌ను కలిసి వెళ్లారు. టిపిఎస్ మంజులకు మాత్రం కమిషనర్ ఛాంబర్‌లోకి వెళ్లేందుకు అనుమతి రాలేదు. కమిషనర్ ఛాంబర్‌లోకి వెళ్లడానికి ఒక రెగ్యులర్ టిపిఎస్, అందులోనూ మహిళా ఉద్యోగికి అనుమతి ఇవ్వకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో టిపిఎస్ మంజుల హిందూపురం, ధర్మవరం తదితర మున్సిపాల్టీల్లో సైతం పనిచేసింది. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, ఒక బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ మాత్రమే ఉన్నారు. వాస్తవానికి టౌన్ ప్లానింగ్‌లో ఇద్దరు ఎసిపిలు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, నలుగురు టిపిఎస్‌లు, 8 మందికి పైగా బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ల పోస్టులు ఉన్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగంలో 15 పోస్టులకు గాను ప్రస్తుతం ముగ్గురు మాత్రమే పనిచేస్తున్నారు. సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటంతో విశాలమైన నగరంలో అక్రమ కట్టడాలు భారీగా పెరిగిపోతున్నాయి. పని భారంతో సిబ్బంది సతమతం అవుతున్నారు. దీనివల్ల మున్సిపల్ కార్పొరేషన్‌కు బిల్డింగ్ ప్లాన్లు, ఫీజుల రూపంలో రావాల్సిన ఆదాయానికి గండిపడుతోందన్న అభిప్రాయం ఉద్యోగ వర్గాల్లో వ్యక్తం అవుతోంది. వీటిని గురించి కమిషనర్ పట్టించుకోవడం లేదనే విమర్శలు గుప్పుమంటున్నాయి.



కమిషనర్ చాంబర్ ముందు వేచి ఉన్న టిపిఎస్ మంజుల

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి : ఎస్పీ

అనంతపురం క్రైం : జిల్లాలో ప్రశాంతంగా ఉప ఎన్నికలు నిర్వహించేందుకు అన్నివర్గాల ప్రజలు సహకరించాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జిల్లాలో శనివారం జరగనున్న పంచాయతీ ఉప ఎన్నికలు, కౌంటింగ్ ప్రక్రియల సందర్భంగా ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్లు, ఏజెంట్లు, అభ్యర్థులు మొబైల్ ఫోన్లు, ఐ ప్యాడ్, ట్యాబ్ తదితర ఎలాక్ట్రానిక్ వస్తువులు పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లకూడదన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు ఎవరూ గుంపులుగా ఉండరాదన్నారు. పోలింగ్ బూత్ లోపల ఫొటోలు, వీడియోలు తీయకూడదన్నారు. కౌంటింగ్ తర్వాత ఎవరూ విజయోత్సవ ర్యాలీలు చేయరాదని, బాణాసంచా కాల్చరాదని తెలిపారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, అతిక్రమించినా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే డయల్ 100కి కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

సాగునీటి కోసం ఆయకట్టు రైతుల నిరసన

బొమ్మనహాల్ : మండల పరిధిలోని గోవిందవాడ, దర్గాహొన్నూరు, బల్లనగుడ్డం, తదితర గ్రామాల ఆయకట్టు రైతులు సాగునీటి కోసం శుక్రవారం సర్పంచి గాధలింగ ఆధ్వర్యంలో డిస్ట్రిబ్యూటర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లా డుతూ డిస్ట్రిబ్యూటర్ కాలువ వద్ద అధికారులు చేపట్టిన అనైతిక నిర్మాణం వల్ల ఆయకట్టుకు సాగునీరు అందడం కష్టంగా మారిందని వాపోయారు. ఇకనైనా అధికారులు స్పందించి 9వ డిస్ట్రిబ్యూటర్ నుంచి వచ్చే కాలువ మరమ్మతులు చేపట్టి ఆయకట్టుకు సాగునీరు అందేలా చూడాలని కోరారు.

విద్యార్థి, యువజన సంఘాల నాయకులు అరెస్టు



ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ కళాశాలను ముట్టడించేందుకు వెళ్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. ఆగస్టు 15వ తేదీ కళాశాలకు మొబైల్ ఫోన్ తెచ్చాడనే ఉద్దేశంతో విద్యార్థి ఇషాక్‌ను చితక బాదిన ప్రిన్సిపల్‌పై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, ఎఐవైఎఫ్ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు కుమార్, కొట్రేష్ డిమాండ్ చేశారు. విద్యాబుద్ధులు, క్రమశిక్షణ నేర్పించాల్సిన అధ్యాపకులు విద్యార్థిని ఇలా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. దీనిపై స్పందించిన ప్రిన్సిపల్ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఎఐవైఎఫ్ నాయకులు నవీన్, అనిల్, వివేక్, వీరేష్, గౌతమ్, లోకేష్, వంశీ, దాదాపు 50 మంది విద్యార్థులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల విమర్శలను ప్రజలు నమ్మరు

ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేక తమ రాజకీయ ఉనికి కోసం ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ప్రజలు పట్టించుకునే స్థితిలో లేరని ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం విడపనకల్లు మండలం మాళాపురం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ముందుగా వివిధ పథకాలతో లబ్ధిపొందిన మహిళలతో కలిసి సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇది ఓర్చుకోలేని టిడిపి, జనసేన పార్టీల అధ్యక్షులు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ వైసిపి ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. వారి విమర్శలను ప్రజలు పట్టించుకునే స్థితిలో లేరన్నారు. చంద్రబాబు అండ్ కోకు ఈసారి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు, వైస్ ఎంపిపి సునీత రామాంజనేయులు, వైసిపి నాయకులు కరణం భీమరెడ్డి, కొట్టాలపల్లి సర్పంచి రామాంజనేయులు, ఎఫ్ఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు హేమవతి, డోనేకల్లు రమేష్, రాజశేఖర్, కేశన్న, చిట్టిబాబు, మాళాపురం గ్రామ నాయకులు రామాంజనేయులు, ఓబులప్ప, ప్రకాష్‌గౌడ్, వెంకటేష్, ఓబులేసు, నాగరాజు, నాగన్నగౌడ్, జయరామ్, బాలు, శ్రీరాములు, జగన్నాథ్, బుసప్ప, గజేంద్ర, కొట్టాలపల్లి ధనుంజయ పాల్గొన్నారు.

పశువులకు మెరుగైన వైద్యం

ఉరవకొండ : పశువులకు మెరు గైన వైద్యం అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయ ప్రాంగణంలో ప్రభుత్వం సరఫరా చేసిన పశువుల మందులను ఆర్‌బికెల సహాయకులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరవకొండ డివిజన్ పరిధిలోని 15 మండలాల్లో ఒక్కొక్క రైతు భరోసా కేంద్రానికి రూ.33వేల విలువజేసే మందులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు నరేష్, వెంకటేష్ శర్మ, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-నార్పల



శిక్షణ పొందిన రైతులతో శాస్త్రవేత్తలు

మండలంలోని సిద్ధరాచెర్ల రైతు భరోసా కేంద్రంలో సర్పంచి సాకే రామాంజనేయులు అధ్యక్షతన రైతులకు వర్షాధార పంటలు, యాజమాన్య పద్ధతులపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆచార్య ఎన్జీ.రంగా వ్యవసాయ పరిశోధన స్థానం, అనంతపురం జాతీయ వ్యవసాయ పరిశోధనా నిర్వహణ సంస్థ, హైదరాబాద్ నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ మేనేజ్మెంట్ సంయుక్తంగా మూడు రోజులపాటు షెడ్యూల్ కులాల రైతులకు రైతులకు శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా భూసార పరీక్షలు, నీటి నిర్వహణ, ఎరువుల యాజమాన్యం, కీటక నియంత్రణ, సమగ్ర మెట్ట వ్యవసాయంపై షెడ్యూల్ కులాల రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి బి.సహదేవరెడ్డి, డాక్టర్ పి.రాధిక, కోఆర్డినేటర్ డాక్టర్ కేసీ నటరాజ్, హైదరాబాద్ ఎన్ఎఎఆర్ఎం కోఆర్డినేటర్ డాక్టర్ సుప్రియ, డాక్టర్ వెంకటరమణ, హార్టికల్చర్ అసిస్టెంట్ కుపేంద్ర, దుర్గం, సిద్ధరాచెర్ల, గొల్లపల్లి రైతులు పాల్గొన్నారు.

వైసిపి ఓట్లు తొలగించేందుకు కుట్ర

ప్రజాశక్తి-ఉరవకొండ




విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

నియోజకవర్గంలో వైసిపి సానుభూతిపరుల ఓట్లను తొలగించేందుకు ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కుట్ర చేస్తున్నారని వైసిపి నాయకులు ఆరోపించారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేశవ్ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ఈసారి విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు ఖాయమన్నారు. నియోజకవర్గం ఎక్కడుందో కూడా తెలియని ఎంపీ రఘురామ కృష్ణంరాజు ద్వారా వైసిపి సానుభూతిపరుల ఓట్లు తొలగించాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించడం విడ్డూరంగా ఉందన్నారు. వైసిపి సానుభూతిపరులు వందల మంది బతికున్నా.. చనిపోయినట్టు పేర్లు తొలగించాలని కేశవ్ ఫిర్యాదు చేయించడం సిగ్గుచేటన్నారు. ప్రతి ఎన్నికల్లో దొంగ ఓట్లతో గెలుస్తూ వస్తున్న కేశవ్ ఈసారి దొంగ ఓట్లను తొలగిస్తుంటే ఓడిపోతానని తెలిసి ఇలాంటి కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో వైసిపి మండల కన్వీనర్ నరసింహులు, జడ్పిటిసి పార్వతమ్మ, ఎంపిపి చంద్రమ్మ, మాజీ ఎంపిపి ఏసీ ఎర్రిస్వామి, సర్పంచి లలిత, నాయకులు బసవరాజు, అశోక్‌కుమార్, తేజోనాథ్, గోవిందు, ఓబన్న, సలీం, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ఫలితాల్లో మెరిసిన 'బంజారా' ఆణిముత్యాలు

సిటిఓగా వర్షిణి, ఆర్‌టిఓగా భరత్ చౌహాన్ ఎంపిక

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



వర్షిణీ భరత్‌చౌహాన్

గ్రూప్-1 ఫలితాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాకు బంజారా యువత విజేతలుగా విజయబావుటా ఎగురవేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా సోమందేపల్లి మండలం, నాగినాయనిచెరువు తండాలోని విశ్రాంత ఎంపిడిఓ ఎల్.రామానాయక్ మనవడు ఎల్.భరత్‌చౌహాన్ ఆర్‌టిఓగా ఎన్నికయ్యారు. అలాగే నాగినాయనిచెరువు తండకు చెందిన రిటైర్డ్ ఐఎఎస్ కుమావత్ రాంశంకర్‌నాయక్ కుమార్తె వర్షిణీబాయి సిటిఓగా ఎంపిక అయ్యారు. తండ్రి ఐఎఎస్ అధికారిగా పని చేస్తున్నప్పుడే ఆదర్శంగా తీసుకుని తాను కూడా ఐఎఎస్ కావాలనే లక్ష్యంతో కష్టపడి చదివినట్లు వర్షిణీబాయి తెలిపారు. బంజారా కుటుంబంలో పుట్టిన ఆణిముత్యాలు వర్షిణిబాయి, భరత్‌చౌహాన్ రాష్ట్రంలోని బంజారా యువతకు ఎంతో ఆదర్శంగా నిలిచారని సేవాఘడ్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి అశ్వర్థనాయక్, కోశాధికారి బాలానాయక్, ట్రస్టీలు రంగ్లా నాయక్, రంగానాయక్ అభివర్ణిస్తూ అభినందనలు తెలిపారు.

'జనతా మెడికల్స్' ప్రారంభం



జనతామెడికల్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం : నగరంలోని టవర్ క్లాక్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన జనతా మెడికల్స్ షోరూంను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థము జనతా మెడికల్ వారు ఔషధాల ఎంఆర్‌పి ధరల్లో 20 శాతం రాయితీతో అందించడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం డిప్యూటీ మేయర్ కోగట్టం విజయభాస్కర్ రెడ్డి, జనతా మెడికల్స్ సంస్థ అధినేత నాగిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కుమారులు పవన్‌కుమార్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

డిఎల్‌డిఒకు సన్మానం

రాయదుర్గం రూరల్ : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ డిఎల్‌డిఒగా అవార్డు అందుకున్న కళ్యాణదుర్గం డిఎల్‌డిఒ శంకర్‌ను శుక్రవారం ఎంపిడిఒ కొండయ్య ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో ప్రజలకు సత్వర సేవలు అందించి అవార్డు అందుకుని పలువురికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలోని సచివాలయాల్లో ఈ-సర్వీసెస్(సత్వర సేవలు) అందించడం, సచివాలయాల ను ఎక్కువసార్లు తనిఖీ చేయడం, ఒటిఎస్ ద్వారా ప్రభుత్వానికి రూ. 14 లక్షలు చెల్లించడంలో ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ డిఎల్‌డిఒగా అవార్డు వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎఒ చిక్కన్న, సీనియర్ అసిస్టెంట్ రవిచంద్ర ఆజాద్, జూనియర్ అసిస్టెంట్ రాజసింహా, ఎపిఒ నీరజ, ఎంపిడిఒ కార్యాలయ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నీమ్ ట్రీ హోటల్ ప్రారంభం

అనంతపురం : నగరంలోని రామ్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన నీమ్ ట్రీ హోటల్‌ను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూఫెర్రర్, ఎఎఫ్ డైరెక్టర్ వైవి మల్లారెడ్డి, యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్‌యాదవ్, హోటల్ ప్రతినిధులు పాల్గొన్నారు.



నీమ్‌ట్రీ హోటల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత, మాంఛూఫెర్రర్

చెబితే చేస్తాం..చేసేదే చెబుతాం..

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

చెబిలే చేయడం.. చేసేదే చెప్పడి సిఎం జగన్ నైజం అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు మంజూరైన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. నాడు-నేడు ద్వారా విద్య, వైద్యంలో ఎన్నో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చారన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. సిఎం జగన్ నిత్యం ప్రజా సంక్షేమం కోసం ఆలోచిస్తుంటే.. ప్రతిపక్ష పార్టీలు మాత్రం ఎలా ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రావాలా.. అని ఆలోచిస్తున్నాయన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఒక్క అనంతపురంలోనే రూ.750 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలను పూర్తి చేశామన్నారు. అలాగే డంప్‌యార్డులోని వ్యర్థాన్ని తొలగించడం అసాధ్యం కనుక బయోమైనింగ్ ప్లాంట్ ద్వారా వ్యర్థాన్ని రీసైక్లింగ్ పద్ధతితో సమస్యను పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే బయోమైనింగ్ ప్లాంట్ ద్వారా 5 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాన్ని తొలగించామన్నారు.



రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ఇళ్ల పట్టాలు పంపిణీ

రాజీవ్ కాలనీ పంచాయతీ ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఎమ్మెల్యే అనంత ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ గత పాలకులు దత్తత పేరుతో ప్రజలను మోసం చేస్తే, వైసిపి అధికారంలోకి వచ్చాక రూ.కోట్లు వెచ్చించి కాలనీని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజీవ్‌కాలనీ ఉపసర్పంచి మసూద్, మాజీ సర్పంచి హుస్సేన్, నాయకులు అంజి, రంగయ్య, బాబు, విఆర్ఒ అమర్నాథ్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-నార్పల

స్థానిక జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా పరిషత్ సిఇఒ భాస్కర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉప ఎన్నిక జరిగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని తప్పకుండా పాలించాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ దివాకర్, ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహా, పంచాయతీ సెక్రటరీ అశ్వర్థమనాయుడు పాల్గొన్నారు.



నార్పలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సిఇఒ భాస్కర్‌రెడ్డి, తదితరులు

పెద్దవడుగూరు : మండలంలోని గుత్తివెంకటాంపల్లి గ్రామంలో శనివారం నిర్వహించనున్న వార్డు ఉప ఎన్నిక పోలింగ్ కేంద్రాన్ని డీఎస్పీ సిఎం గంగయ్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కేంద్రంలో వసతుల ఏర్పాట్లపై స్థానిక సిఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎన్నికలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతలపై చర్చించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద శాంతి భద్రతలకు భంగం కలగకుండా పెట్రోలింగ్ చేయాలని సిబ్బందికి సూచించారు.

యాడికి : మండల కేంద్రంలోని వార్డు ఉప ఎన్నికల కేంద్రాన్ని తాడిపత్రి డీఎస్పీ గంగయ్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కేంద్రంలో ఓటర్లకు కల్పించనున్న ఏర్పాట్లను పరిశీలించారు. శాంతిభద్రలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో

గార్లదిన్నె : మండల పరిధిలోని బూదేడు గ్రామ పంచాయతీలో 9వ వార్డుకు నిర్వహించనున్న ఉప ఎన్నిక కేంద్రాన్ని సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ శుక్రవార ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సాగర్, పోలీసులు పాల్గొన్నారు.

పరుగులు తీస్తున్న అభివృద్ధి

ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వ

ప్రజాశక్తి-ఉరవకొండ

జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని షిరిడీ సాయినగర్‌లో రూ.14.50 లక్షల ఎంపీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా పాలన సాగుతోందన్నారు. ఓవైపు సంక్షేమ పథకాలను అమలు చేయడంతోపాటు మరోవైపు అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేశామన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాలతో పాటు సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ప్రభుత్వ భవన నిర్మాణాలు చేపడుతూ గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకెళు న్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అమృతరాజ్, ఎంపిపి చందా చంద్రమ్మ, జడ్పిటిసి ఏసీ పార్వతమ్మ, సర్పంచి లలిత, ఉప సర్పంచి వన్నప్ప, వైస్ ఎంపిపి నరసింహులు, వార్డు సభ్యులు రేణుక, వాసు, ఓబుళమ్మ, శర్మస్, ఎంపిటిసిలు ఈడిగ ప్రసాద్, వన్నూరుసాబ్, కో అప్షన్ సభ్యులు సలీమ్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, పిఎసిఎస్ ఛైర్మన్ వడ్ల షేక్షావలి, మాజీ ఎంపిపిలు ఏసీ ఎర్రిస్వామి, నాగేశ్వరరావు, నాయకులు ఓబన్న, బసవరాజు, ఆసీఫ్, అన్వర్, జోగి భీమన్న, పచ్చి రవి, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వ

టిడిపితోనే 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్.రాజు

ప్రజాశక్తి-శింగనమల

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజల భవిష్యత్తుకు భరోసా అని ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్.రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని గుమ్మేపల్లిలో ఇంటింటికీ వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టబోయే పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చి చంద్రబాబు సిఎం అయితే రైతులకు సంవత్సరవానికి రూ.2వేలు, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, ప్రతి ఇంటికీ మూడు గ్యాస్ కనెక్షన్లు, 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకూ రూ.1500, ఇంటిలో ఎంతమంది చదువుకుంటున్నా ప్రతి విద్యార్థికీ సంవత్సరానికి రూ.15వేలు అందించనున్నట్లు వివరించారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మాసూలు చంద్రమోహన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి బ్యాల్ల సుదర్శన్, మాట్లగొంది సర్పంచి గాండ్ల రమేష్, నాయకులు శ్రీనివాసులు, హరీష్, కిరణ్ నార్పల మండల కన్వీనర్ ఎర్రనాగప్ప, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు డాల్ వీరనారాయణ, పార్లమెంట్ సోసియల్ మీడియా ఎర్రిస్వామి, జిల్లా బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కొయ్యగూర పెద్దన్న, చంద్రాయుడు, బోయ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు చూపుతున్న టిడిపి నాయకులు

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు


ప్రజాశక్తి- అనంతపురం సిటీ

అనంత రూరల్ మండలం రుద్రంపేట పంచాయితీలో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచి సుగాలి పద్మావతి ఆదినారాయణ నాయక్ తెలిపారు. ఈమేరకు రుద్రంపేట పంచాయితీలోని మధర్‌థెరిస్సా కాలనీ, ఐటీ కాలనీల్లోని ప్రజల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన బోర్లకు శుక్రవారం మోటార్లు బిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సహకారంలో నూతన బోర్లు బిగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

మిత్రపురుగుల సాంద్రత పెంచాలి

అనంతపురం : పంట పొలాల్లో మిత్ర పురుగుల సాంద్రత పెంచాలని అనంతపురం రూరల్ మండల వ్యవసాయ అధికారిణి జె.శశికళ సూచించారు. శుక్రవారం అనంతపురము రూరల్ మండలంలోని నారాయణపురంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆకుల కత్తిరింపు ప్రయోగాన్ని వివరించారు. ఈ సందర్భంగా పంటలను పరిశీలించగా పచ్చ దోమ ఉన్నట్టు గుర్తించారు. అయితే తక్కువ స్థాయిలో ఉండడం వల్ల వర్షం పడితే ఉధృతి తగ్గుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ ప్రసాద్, విహెచ్ఎ నాగలత, అగ్రి అడ్వైజరీ బోర్డు సభ్యులు రామసుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి : ఎంపిపి



మాట్లాడుతున్న ఎంపిపి పెద్దన్న

బెలుగుప్ప : అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంపిపి పెద్దన్న సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పల సమస్యలను అధికారులు దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు, డ్రెయినేజీ సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వీటితోపాటు పలు సమస్యలను ప్రస్తావించగా స్పందించిన అధికారులు వాటి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి.ఓబులేసు, ఎంపిడిఒ రామచంద్ర, ఎఒ పృథ్వీసాగర్, ఎఇ గంగాధర్, హౌసింగ్ ఎఇ శివారెడ్డి, ఇఒఆర్‌డి గూడెన్న, ఎపిఎం ఆంజనేయులు, నాయకులు శ్రీనివాసులు, త్రిలోక్‌నాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు శివలింగప్ప, రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టరాదు

బొమ్మనహాల్ : మండల పరిధిలోని ఉద్దేహాల్ గ్రామంలో సర్వే నెంబర్-245-బిలో ఉన్న భూమిపై ఎవరికీ హక్కు లేదని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినట్లు తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సదురు స్థలంలో విఆర్ఒ, విఆర్ఎలు రెవెన్యూ బోర్డు ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరైనా నిర్మాణాలు చేపట్టినా, కబ్జా చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. ఆ సర్వే నెంబర్‌లో 1.8 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఎలాంటి లే అవుట్లు వేయలేదని తెలిపారు. ఈ భూమిని అమ్మినా, కొనుగోలు చేసినా చట్టపరంగా నేరమని తహశీల్దార్ హెచ్చరించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పోలీస్‌స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన



పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

ఉరవకొండ : పట్టణ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీకి చెందిన మనోహర్(26) పెన్నఅహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరిగిన వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా పట్టణ సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన ఐచర్ వాహనం ఢీకొంది. దీంతో మనోహర్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రమాదానికి కారణమైన ఐచర్ వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా పోస్టుమార్టం అనంతరం మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని మృతదేహంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ హరినాథ్ మృతుని కుటుంబ సభ్యులతో చర్చించి ప్రమాదానికి కారణమైన ఐచర్ వాహనాన్ని స్టేషన్‌కు తరలించామని, డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు

గార్లదిన్నె : మండల పరిధిలోని పెనకచెర్లలో భార్య ఆత్మహత్య చేసుకున్న కేసులో భర్తను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పెనకచర్ల గ్రామంలో గత సోమవారం వేణుగోపాల్ భార్య మీనాక్షి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో వేణుగోపాల్‌ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రానైట్ వితరణ



గ్రానైట్‌ను అందజేస్తున్న రామాంజనేయులు

గుత్తి : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాల ప్రతిష్టకు గుత్తికి చెందిన ఎం.రామాంజనేయులు గ్రానైట్ బండలను వితరణ చేశారు. జిల్లాలోని తూముచెర్ల, తిప్పేపల్లి గ్రామాల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. ఆయా గ్రామాల ప్రజల అభ్యర్థన మేరకు గ్రానైట్ బండల వ్యాపారి ఎం.రామాంజినేయులు 4.70 చదరాల గ్రానైట్ బండలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్షులు విజయ్, మాల మహాసభ జిల్లా అధ్యక్షులు జీసీ.నాగప్ప, రామకృష్ణ, రామంజి, తదితరులు పాల్గొన్నారు.

తపాలా కార్యాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు

గుత్తి : పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న ప్రధాన తపాలా కార్యాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు హెడ్ పోస్ట్‌మాస్టర్ విశ్వనాథరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఆధార్ కార్డు, చిరునామా, పేర్లు, చేర్పులు, మార్పులు కోసం హెడ్ పోస్టాఫీస్‌లోని ఆధార్ కేంద్రంలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీసు గ్రీవెన్స్‌కి 12 వినతులు

అనంతపురం క్రైం : పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్పీ కె.శ్రీనివాసరావు శుక్రవారం చేపట్టిన గ్రీవెన్స్ కార్యక్రమానికి 12 వినతులు వచ్చాయి. ఇందులో భాగంగా ఆయా బాధిత పోలీసులతో ఎస్పీ ముఖాముఖీగా మాట్లాడారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కారం చూపాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనా అధికారి శంకర్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్‌రెడ్డి, ఎస్పీ సీసీ ఆంజనేయప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సిఐ హరినాథ్‌కి ఘన సన్మానం

ఉరవకొండ : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్న ఉరవకొండ అర్బన్ సీఐ హరినాథ్‌ని పట్టణ ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ నాయకులు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా శాలువా కప్పి బొకేలు అందజేసి అభినందించారు. సీఐ హరినాథ్ భవిష్యత్తులో కూడా మరిన్ని ఉత్తమ అవార్డులు, ప్రశంసాపత్రాలను అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీవాణి విద్యానికేతన్ కరస్పాండెంట్ రఘురాములు, ప్రయివేట్ పాఠశాలల యూనియన్ నాయకులు సిద్ధప్ప, నిజాం, తదితరులు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన బొంబాయి రమేష్ నాయుడు

యాడికి : తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో సిఎం జగన్‌ను యాడికి వైసిపి మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో అభివృద్ధి, రాజకీయ పరిస్థితులపై ఆరాతీసినట్లు రమేష్‌నాయుడు తెలిపారు.

సచివాలయాల తనిఖీ

పుట్లూరు : మండల పరిధిలోని ఎల్లుట్ల, మడ్డిపల్లి సచివాలయాలను ఎంపిడిఒ యోగానందరెడ్డి శువ్రారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ బీమా, జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాల్లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా డ్రాపౌట్ పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలాకాకుండా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు వెల్లుట్లలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయంతోపాటు ఆర్‌బికె కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'విలువలబడులు' ప్రారంభం

అనంతపురం : కుందుర్పి మండలంలోని రుద్రంపల్లి, అల్లాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన విలువల బడులను మాజీ లెఫ్టినెంట్ కల్నల్ ఓంప్రకాష్, ప్రభుత్వ ఉపాధ్యాయులు సత్యప్రభ, సంపత్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా గాయకుడు ఎస్‌కె లెనిన్‌బాబు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఎస్‌కె ఛారిటబుల్ ట్రస్టు ద్వారా విలువల బడులను నిర్వహించడం సంతోషకరమన్నారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి బడులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఎస్‌కె.లెనిన్‌బాబు మాట్లాడుతూ ఇప్పటికే కుందుర్పి మండల వ్యాప్తంగా 20 గ్రామాల్లో విలువల బడులను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు లక్ష్మణమూర్తి, బొమ్మలింగ, రుద్రంపల్లి ఎంపిటిసి మల్లికార్జున, ప్రభుత్వ ఉపాధ్యాయులు నింగన్న, సరస్వతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

ఉరవకొండ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తల కోదండరామిరెడ్డి సూచించారు. శుక్రవారం వజ్రకరూరు మండల పరిధిలోని కొనకొండ్ల ఎంజెపి గురుకుల పాఠశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ హర్షద్‌వలి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు, సిబ్బంది వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ఖచ్చితంగా పాటిస్తే సీజనల్ వ్యాధులు దూరమవుతాయన్నారు. గ్రామాల్లో సచివాలయ సిబ్బంది వాలంటీర్లను సమన్వయం చేసుకుని ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి ఫ్రైడే డ్రైడే పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, శ్రీరాములు, ఎఎన్ఎం భవ్య, ఎంఎల్‌హెచ్‌పి శ్రావణి, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.